క్లుప్తంగా

వైభవంగా ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట



ఫిరంగిపురం: శిరంగిపాలెం గ్రామంలోని బాలాంజనేయస్వామి ఆలయంలో గోపుర కలశ, ధ్వజస్తంభ, శీతల యంత్ర ప్రతిష్ట గురువారం వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు దీవి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పంచగవ్య పూజ, శీతల యంత్రాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయంపై శిఖరాలు ఏర్పాటు చేశారు. ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసి, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు డి.ప్రసన్నమూర్తి, సురేష్ కుమార్, గోవర్ధన్ రఘురామ్, సురేష్ పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యమివ్వాలి



ఫిరంగిపురం: మండలంలోని అల్లంవారిపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ బాల్య వివాహం చేసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. బాల్య వివాహాల నిషేద చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రావణి, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీలు మాధవి, సుమతి పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న మధ్యాహ్నం 2.30 గంటలకు జరగనున్న సమావేశానికి ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని వెల్లడించారు.

520 పశువులకు గాలికుంటు టీకా



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు పశు వైద్యశాల పరిధిలోని తొమ్మిది గ్రామాల్లోని 520 పశువులకు గాలి కుంటు వ్యాధి టీకా వేసినట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ గురువారం తెలిపారు. నుదురుపాడు, వేమవరం, కండ్రిక, యర్రగుంట్లపాడు, మునగపాడు, మేరికపూడి, పొనుగుపాడు, బేతపూడి, గుండాలపాడు గ్రామాల్లో సుమారు ఐదు వేల వరకు పాడి గేదెలు, ఆవులు ఉన్నాయని చెప్పారు. వాటికి గాలి కుంటు వ్యాధి రాకుండా ఉండేందుకు ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18వరకు వ్యాధి నిరోధక టీకా ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని పశు వైద్యశాఖ సిబ్బంది పశువులకు టీకా వేస్తున్నట్లు చెప్పారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



రావెల(తాడికొండ): బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఐసీడీఎస్ సీడీపీవో ప్రసున్న అన్నారు. గురువారం తాడికొండ మండలం రావెల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టు, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. వివాహ వయస్సు అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండాలన్నారు. బాల్య వివాహాల కారణంగా పుట్టే పిల్లల్లో శారీరక, మానసిక లోపం ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే 1098, 100, 181 నంబరుకు ఫోన్ చేసి, సమాచారం అందిస్తే వెంటనే నిలుపుదల చేస్తామని చెప్పారు. ఎంఈవో-2 ప్రభాకర్‌రావు మాట్లాడుతూ బాలికలపై వివక్షలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్య వివాహానికి పాల్పడితే.. రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రాప్ జిల్లా కో ఆర్డినేటర్ జి.వెంకట్, పాఠశాల హెచ్‌ఎం ఎస్‌వీ నాగమణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కళావతి, జిల్లా కో-ఆర్డినేటర్ వెంకట్, మహిళా సంరక్షణాధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

జిల్లా వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్వర్లు

ఫిరంగిపురం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పత్తి రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఈ-పంట లో పంట వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ప్రతి రైతు తన పొలంలో కొంత ప్రకృతి వ్యవసాయం చేసుకోవాలని కోరారు. శాస్త్రవేత్త దయానా మాట్లాడుతూ పత్తిని ఆశించే గులాబీ రంగు పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎకరానికి నాలుగు నుంచి 6 వరకు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. దీనిద్వారా గులాబీ రంగు లార్వాలు నశిస్తాయని తెలిపారు. ప్రతి రైతు శాస్త్రవేత్తలు సూచించిన విధంగానే ఎరువులు వాడుకోవాలని దీని ద్వారా రోగ నిరోధక శక్తితోపాటు అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ షేక్.షహేలా నర్గీస్, సహాయ వ్యవసాయ సంచాలకుడు సునీల్, ఆత్మ డీడీఏ వెంకటేశ్వర్లు, ఏవోలు వాసంతి, రాజవంశీ, మండవ నరసింహారావు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



బ్యాంక్ కాలనీలో రోడ్లపై కుక్కలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటీఎంసీ) పరిధిలో వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. దీంతో చిన్నారులు, విద్యార్థులు బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నా జంతు ప్రేమికుల అత్యుత్సాహం అందుకు అడ్డుపడుతోంది. ప్రజల ప్రాణాల మీదకు వస్తున్నా.. అధికారులు కేసుల భయంతో మిన్నకుండిపోతున్నారు. అధికారులు కుక్కలు పట్టుకున్నారని మీడియా, పత్రికల్లో వచ్చిన వెంటనే..జంతు ప్రేమికులు కుక్కలు ఎన్ని పట్టుకున్నారు? వాటి సంరక్షణకు తీసుకున్న చర్యలు ఏమిటీ? అంటూ అధికారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటి వరకు పట్టుకున్న వీధి కుక్కలకు వాసెక్టమి తెనాలి మున్సిపాలిటీకి తీసుకెళ్లి చేయించేవారు. దీంతో ఆ కేంద్రాన్ని నగర పరిధిలోని కాజలో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నగరంలో సుమారు 2,340కు పైగా వీధి కుక్కలను అధికారులు గుర్తించారు. చాలా కుక్కలను పట్టి వాసెక్టమి ఆపరేషన్ చేయించి, తిరిగి నగరంలో వదిలారు. నగరంలోనే వాసెక్టమీ కేంద్రం ఏర్పాటు కానుండడంతో కుక్కల నియంత్రణ అదుపులో ఉంటుందని అధికారులు చెప్తున్నారు.

ఫిరంగిపురంలో కుండపోత



ఓ దుకాణంలోకి చేరిన మురుగు నీరు



రాజాపేట వద్ద మోకాళ్ల లోతున నిలిచిన నీరు

ఫిరంగిపురం: మండలంలో గురువారం సాయంత్ర గంట పాటు కుండపోత వర్షం కురిసింది. ఫిరంగిపురంలో రోడ్లు జలమయమయ్యాయి. రాజాపేట, కొండమెట్ల బజారులో కొండపై నుంచి వచ్చిన నీటితో రోడ్లపై మోకాళ్ల లోతులో నీరు నిలిచిపోయింది. ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న దుకాణాల్లోకి వర్షం నీరు వచ్చింది. దీంతో దుకాణాదారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. బకెట్లు, డబ్బాలతో నీటిని బయటకు తోడి పోశారు. వస్తువులు తడిసిపోయాయని వారు వాపోయారు. ఈ ప్రాంతంలో మురుగు కాలువల్లో సరిగా పూడిక తీయక పోవడంతో వర్షం నీరు దుకాణాల్లోకి వచ్చి చేరుతోందని తెలిపారు.

జీఎస్టీ రాష్ట్ర కార్యాలయాన్ని గుంటూరుకు తీసుకురండి

సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ కమిషనర్‌ను కలిసిన పెన్షనర్ల సంఘ నాయకులు



వినతి పత్రం అందజేస్తున్న సీబీఐసీ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

లక్ష్మీపురం: కేంద్రప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం విశాఖపట్నంలో ఉన్న సీజీఎస్టీ ఆడిట్ కమిషనరేట్ రాష్ట్ర ప్రధాన కార్యాలయాన్ని గుంటూరుకు తరలించాలని ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ శాఖకు చెందిన రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.వివేకానంద, గద్దె తిలక్ పేర్కొన్నారు. ఈమేరకు గుంటూరు కాకాని రోడ్‌లోని సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విశాఖపట్నం కేంద్రంగా వున్న సెంట్రల్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ కార్యాలయం అమరావతికి, విశాఖ ఆడిట్ కమిషనరేట్ కార్యాలయం గుంటూరుకు తరలిపోవాలని పది సంవత్సరాల క్రితమే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా ఎలాంటి మార్పు జరగలేదన్నారు. ఈ విషయంలో చొరవ తీసుకొని ఆడిట్ హెడ్ క్వార్టర్స్‌ను గుంటూరుకు తరలించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆడిట్ కమిషనర్‌ను కలిసిన వారిలో పెన్షనర్ల సంఘ నాయకులు పి.వి.సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.కోటేశ్వరరావు, సామ్రాజ్యం ఉన్నారు.

అనధికార ప్రకటనల హోర్డింగ్స్ తొలగింపు

జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు



అనధికార ప్రకటనల హోర్డింగ్స్‌ను తొలగిస్తున్న పట్టణ ప్రణాళిక సిబ్బంది

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ అనుమతితో నగరంలో ఏర్పాటు చేసిన ప్రతి ప్రకటన బోర్డ్‌కు నిర్దేశిత మీడియా డివైజ్ డిస్ ప్లే ఫీజులు చెల్లించి ఉండాలని, ఫీజులు చెల్లించని, అనుమతి లేని బోర్డులను తొలగిస్తామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం పట్టణ ప్రణాళిక అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఫీజులు చెల్లించని, అనధికార హోర్డింగ్‌లు, బోర్డ్‌లను, ఫ్లెక్సీలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్రకటనల హోర్డింగ్స్ యజమానులు మీడియా డివైజ్ డిస్ ప్లే ఫీజులు సక్రమంగా చెల్లించాలని, లేకుంటే సదరు బోర్డ్ లను తొలగించి, ఫీజుల వసూళ్లకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం నుంచి నగరంలో పట్టణ ప్రణాళిక అధికారులు నగరంలో సుమారు 120కి పైగా అనధికార హోర్డింగ్‌లను తొలగించారన్నారు. అనధికార బోర్డు, హోర్డింగ్స్ నగరంలో ఉండడానికి వీలు లేదని, అటువంటి వాటిని వెంటనే తొలగించడానికి పట్టణ ప్రణాళిక అధికారులు స్పెషల్ టీంను అందుబాటులో ఉంచాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు.

- పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్ల విస్తరణ చేస్తున్నామని, కొందరు రోడ్ల మీద వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్ కి అంతరాయం కల్గిస్తున్నారన్నారు. రోడ్, ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపులో రాజీపడకూడదన్నారు. పట్టణ ప్రణాళిక అధికారుల ద్వారా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, తమ క్షేత్రస్థాయి పర్యటనలో ఎక్కడైనా అనధికార బోర్డులు గుర్తిస్తే సంబంధిత కార్యదర్శిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభ్యుదయ మహిళా కళాశాలలో కామర్స్ ఫెస్ట్-2024

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఉన్నతస్థానానికి చేరుకునేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం ఎంతో అవసరమని అమెరికాకు చెందిన డేటా ఎనలిస్ట్ ఇక్కుర్తి వెంకట్ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో గురువారం కామర్స్ ఫెస్ట్-2024 నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడంతో పాటు జీవితాన్ని సక్రమంగా గడిపేందుకు కీలకమైన ఏడు సూత్రాలను గురించి వివరించారు. భారతీ సోఫ్‌వర్క్స్ ఎండీ దివ్యభారతి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామివేత్తలుగా రాణించేందుకు, కంపెనీ నిర్వహణకు సంబంధించిన మార్గాలను వివరించారు.

నందమూరి దీప్తి మాట్లాడుతూ స్థిరమైన లక్ష్యం ఏర్పరచుకుని స్పష్టమైన అవగాహనతో ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల బీఎస్ఆర్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ బి. రోహిణిదేవి, కామర్స్ ఫెస్ట్ సమన్వయకర్త ఆర్. అర్జున్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'పై గ్రామ సభల షెడ్యూల్ విడుదల

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామ సభలు నిర్వహించేందుకు ఇన్‌చార్జి ఎంపీడీఓ పి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించాలని తెలిపారు. గ్రామ సభలో ప్రస్తుతం మంజూరు కాబడిన పనులు, జరుగుతున్న పనులను చదివి వినిపించడం, నూతనంగా చేయాల్సిన పనులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలని పేర్కొన్నారు. సామాజిక తనిఖీ ఆవశ్యకతను కూలీలకు అవగాహన కల్పించాల్సి ఉందని, వంద రోజులు వేతన ఉపాధి కల్పించడం, పేదల జీవనోపాధిని సుస్థిరపరచడం తదితర విషయాలను గ్రామ సభలో తెలియజేయాలన్నారు. సచివాలయ, ఉపాధి సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది అందరూ తప్పని సరిగా పాల్గొనాలని తెలిపారు. మండలంలోని 18 గ్రామ పంచాయితీ కార్యదర్శులు చాటింపు గ్రామ ప్రజలకు విషయాన్ని తెలియజేయాలని పేర్కొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



తాడికొండ: గుంటూరు నగరాలులోని షిర్డి సాయి సేవా సమితి వృద్ధాశ్రమంలో మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం అన్నదానం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహను పెంచే సామాజిక సేవలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డీన్ డాక్టర్ పి.ఫణికుమార్, డేటా సైన్స్ హెచ్‌వోడీ సాయి శ్రీనివాస్, డి.రోజా, షేక్ ఖాదర్ బాషా, డి.లావణ్య, కె.హరిత పాల్గొన్నారు.


మైనారిటీ వసతి గృహంలో చేరికలకు దరఖాస్తుల స్వీకరణ

లక్ష్మీపురం: రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు స్థానిక పట్టాభిపురంలోని శ్యామలనగర్ రైల్వే గేటు వద్దనున్న ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహంలో చేరికలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షరీఫ్ గురువారం తెలిపారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల వారు పూర్తిచేసిన దరఖాస్తులను జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో సమర్పించాల్సిందిగా తెలిపారు. క్రైస్తవ మాదిగ, క్రైస్తవ మాల, ఆర్సీఎం, ఇతర క్రైస్తవ విద్యార్థులు తహసీల్దార్ నుంచి తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం జతపర్చాలన్నారు. దరఖాస్తుకు 5 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రేషన్, ఆధార్ కార్డుల నకలు జతచేయాలన్నారు.

వ్యక్తిని మోసం చేసి భూమిని విక్రయించిన వారిపై కేసు

పట్నంబజారు: వ్యక్తిని మోసం చేసి భూమి విక్రయించిన పలువురిపై కేసు నమోదైంది. పట్టాభిపురం ఎస్ఐ మధుపవన్ తెలిపిన వివరాల ప్రకారం గుజ్జనగుండ్లలో నివాసం ఉండే పెంట్యాల భూషయ్య తన రెండు ఎకరాల భూమిని దేవరశెట్టి కిరణ్, మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, కృష్ణారావులకు ఉమ్మడి రిజిస్ట్రేషన్ చేసి రూ.1,22,80,000 అప్పుగా తీసుకున్నారు. అయితే పెంట్యాల భూషయ్యకు తెలియకుండా నలుగురు వ్యక్తులు కలిసి రెండు ఎకరాల భూమిని రూ. 5.80 కోట్లకు విక్రయించారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీఎస్టీ కార్యాలయంలో కంటి వైద్య పరీక్షలు



లక్ష్మీపురం: కళ్ల సమస్యలను అశ్రద్ధ చేయవద్దని సెంట్రల్ జీ.ఎస్.టి కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. స్థానిక కన్నవారితోటలోని సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్ కార్యాలయంలో గురువారం కమిషనర్ సాధు నరసింహారెడ్డి కంటి ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కంటి వైద్య పరీక్షలకు ముందుకు వచ్చిన వాసన్ ఐ కేర్ వైద్య బృందానికి, నిర్వాహకులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో అడిషనల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, జాయింట్ కమిషనర్ లక్ష్మీనారాయణ, ఏసీ నాగరాజు హాజరయ్యారు.

గులాబీ రంగు పురుగుకు కళ్లెం వేయాలి



రైతులకు లింగాకర్షక బుట్టలు అందజేస్తున్న అధికారులు

పొన్నెకల్లు(తాడికొండ): పత్తి పంటకు ప్రధాన సమస్యగా పరిణమించిన గులాబీ రంగు పురుగు బెడదకు కళ్లెం వేసేందుకు రైతులు సామూహిక నివారణ పద్ధతులు పాటించాలని లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ రాజమణి పేర్కొన్నారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎల్‌డీసీ సంస్థ సహకారంతో ల్యాంప్, కారుణ్య సంస్థల సహకారంతో పత్తిలో గులాబీ రంగు పురుగు సమస్య నివారణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న శాస్త్రవేత్త డాక్టర్ రాజమణి మాట్లాడుతూ గులాబీ రంగు పురుగు వల్ల పత్తి పంటకు అపార నష్టం కలుగుతుందన్నారు. దీంతో రైతులు దిగుబడి కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. నివారణకు రైతులందరూ సామూహిక నివారణ చర్యలు ఎలా చేపట్టాలి చెప్పారు. మరో అతిథి లాం వ్యవసాయ క్షేత్ర కీటక నివారణ పరిశోధకుడు రాజేష్ చౌదరి మాట్లాడుతూ గులాబీ రంగు పురుగు నివారణలో లింగాకర్షక బుట్టల పాత్ర కీలకమైనదని, ప్రతి రైతు ఎకరాకు 6 లింగాకర్షక బుట్టలను వాడటంతో పాటు చుట్టు పక్కల రైతులు కూడా వాడేలా చూడటం ద్వారా సామూహిక నివారణ సాధ్యమన్నారు. ఈ సందర్భంగా 150 మంది రైతులకు లింగాకర్షక బుట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్, ఎల్‌డీసీ సంస్థ పరిశోధన విశ్లేషకుడు యు.ఉపేంద్ర రెడ్డి, బేయర్ కంపెనీ మేనేజర్ సంతోష్, కారుణ్య సంస్థ అధ్యక్షుడు టి.మధుసూదనరావు, ల్యాంప్ సంస్థ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, బాజి, మమంగయ్య, శ్రీ రామ్ నారాయణ రైతులు పాల్గొన్నారు.

• కమ్మిన కారుమబ్బులు



మంగళగిరి నగర పరిధిలో గురువారం ఒక్కసారిగా వాతావరణం మారింది. కారు మబ్బులు మంగళ గిరులను కమ్మేశాయి. వర్షం కురిసి, పట్టణం చల్లబడింది. కొద్ది కాలంగా వేసవిని తలపిస్తున్న మండుటెండలతో బేజారిపోయిన నగర వాసులు ఊరట పొందారు.

\- మంగళగిరి

ప్రభుత్వం హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు

తాడేపల్లిరూరల్ : రాజధాని అమరావతి ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు జరిపేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో నిర్వహించిన సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, అసైన్డ్ రైతులకు పెండింగ్‌లో ఉన్న వార్షిక కౌలును చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధితో పాటు, రాజధాని గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, డ్రెయినేజీలు మెరుగుపరచాలన్నారు. రాజధాని గ్రామాల పేదలకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాజధాని గ్రామాల్లోని పేదలకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని, ఎంతో కాలంగా అసైన్డ్ రైతులు ఎదురు చూస్తున్న సమాన ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. రాజధానిలోని అన్ని గ్రామాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని, టిడ్కో గృహాల లబ్ధిదారులు బ్యాంకు రుణాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని, వారి రుణాలను ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, పేరం బాబూరావు, గడ్డం కృష్ణ, కుంభ ఆంజనేయులు, జి.చెంచయ్య, సీహెచ్ సుందరరావు పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనను గమనించాలి



మానవహారం నిర్వహిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్

తాడేపల్లిరూరల్: తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిశితంగా గమనించాలని, వారిలో వస్తున్న మార్పులను గుర్తించాలని కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. గురువారం తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళగిరి రూరల్ పరిధిలోని నూతక్కి గ్రామంలో ప్రధాన కూడలిలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా మానవహారం నిర్వహించారు. మత్తు పదార్థాలు స్వీకరించమని విద్యార్థులు గ్రామస్తులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారు..? వారు ఎటువంటి వారు అనే అంశాలతో పాటు వారి కదలికలపై కన్నేసి ఉంచాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ వి. జోనితిన్, అధ్యాపకురాలు డాక్టర్ టి. సజన, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా చెడు వ్యసనాలకు బానిసలుగా మారితే వెంటనే సంరక్షణ కేంద్రాలకు తీసుకువెళ్లి చికిత్స అందించాలని అన్నారు. వాలంటీర్లను, సమన్వయకర్తలు పి.సురేష్, జి.చంద్రశేఖర్‌ను యూనివర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ అభినందించారు.